క్లుప్తంగా

పోస్టర్లు ఆవిష్కరణ

ఖమ్మంమయూరిసెంటర్: భగత్ సింగ్ 93వ వర్ధంతి సభల పోస్టర్లను సోమవారం స్థానిక రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో పీడీఎస్‌యూ, పీవైఎల్ ఆధ్వర్యాన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి ఆజాద్, పీవైఎల్ జిల్లా కార్యదర్శి ఎస్.వి.రాకేశ్ మాట్లాడుతూ.. దేశ స్వాతంత్రం కోసం ప్రాణాలర్పించిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌లా స్ఫూర్తితో మతోన్మాద బీజేపీ ప్రభుత్వాన్ని గద్దెదించడం కోసం విద్యార్థులను చైతన్యవంతం చేయాలని అన్నారు. మార్చి 23న భగత్‌సింగ్ 93వ వర్ధంతి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా సభలు, సమావేశాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మణ్, వెంకటేశ్, పీవైఎల్ జిల్లా ఉపాధ్యక్షుడు మోహన్‌రెడ్డి, నాయకులు భరత్, సురేశ్ పాల్గొన్నారు.

తిరుమల వెళ్లిన చిమ్మపుడి కోలాట బృందం

రఘునాథపాలెం: మండలంలోని చిమ్మపుడి గ్రామానికి చెందిన కోలాట బృందం మహిళలు తిరుమల దేవస్థానం ఆవరణలో కోలాటం నిర్వహించేందుకు సోమవారం తిరుపతికి బయలుదేరినట్లు బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు, గ్రామ మాజీ ఉపసర్పంచ్ గుత్తా వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రతీ ఏడాది వెంకటేశ్వర్లు సారథ్యాన తిరుమలలో కోలాటం నిర్వహిస్తుండగా.. ఈ ఏడు సుమారు 150 మంది మహిళలు వెళ్లినట్లు చెప్పారు.

'ప్రగతి' విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థులతో యాజమాన్యం

ఖమ్మం సహకారనగర్: ఆలిండియా సైనిక్ స్కూల్ ఎంట్రన్స్ ఫలితాల్లో తమ విద్యార్థులు ప్రతిభ కనబర్చారని ప్రగతి కోచింగ్ సెంటర్ కరస్పాండెంట్ జి.స్వర్ణలత, డైరెక్టర్ సురేశ్ బాబులు తెలిపారు. సోమవారం ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించిన సందర్భంగా వారు మాట్లాడారు. జనవరి 28న ప్రవేశ పరీక్ష జరగగా.. 89 మంది విద్యార్థులు అర్హత సాధించారన్నారు.కార్యక్రమంలో ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

నియామకం

ఖమ్మం మామిళ్లగూడెం: ఆర్టీసీ ఈయూ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శిగా మంచుకొండకు చెందిన పాటి అప్పారావు నియమితులయ్యారు. సోమవారం ఈ మేరకు ఖమ్మంలో జరిగిన మూడో రాష్ట్ర మహాసభలలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ.. టీఎస్ ఆర్టీసీని రాష్ట్రం ప్రభుత్వంలో విలీనం చేసి ట్రెజరీ ద్వారా కార్మికులకు జీతాలు చెల్లించాలని కోరారు.

'గృహ జ్యోతి' పాట్లు

కామేపల్లి: గృహజ్యో తి పథకం కోసం విద్యుత్ వినియోగదారులు ఎంపీడీఓ కార్యాలయం చుట్టూ తిరుగుతూ పాట్లు పడుతున్నారు. 200 యూనిట్లు వినియోగించుకున్న వినియోగదారులకు జీరో బిల్లు రాకపోవడంతో స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆన్‌లైన్ చేయించుకోవడానికి వస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున గృహ జ్యోతి పథకం సైట్ కూడా ఓపెన్ కాకపోవడంతో విద్యుత్ వినియోగదారులు వెనుదిరిగారు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాతనే ఆన్‌లైన్ చేయబడుతుందని ఎంపీడీఓ రవీందర్ తెలిపారు.

నగరంలో సినిమాలు

తిరుమల	ప్రేమలు
వినోద	గామీ
సాయిరాం	తంత్ర. పరతులు వర్తిస్తాయి!
ఆదిత్య	రజాకార్
శ్రీనివాస	భీమా
సుందర్	హనుమాన్

\- ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	18	బచ్చలికూర	3
వంకాయ	26		20
బెండకాయ	20	పాలకూర	3
పచ్చిమిర్చి	30		20
కాకర	40	చుక్కకూర	3
బీర	40		20
దొండ	26	తోటకూర	2
పొట్లకాయ	40		10
చిక్కుడు	100	గోంగూర	2
గోరుచిక్కుడు	46		10
క్యాబేజీ	28	మెంతికూర	3
క్యాలీఫ్లవర్	30		20
ఆలుగడ్డ	28	కొత్తిమీర	1
చామగడ్డ	56		30
క్యారెట్	36	పుదీన	1
క్యాప్సికం	56		20

\-ఖమ్మం వ్యవసాయం

ఎన్నికలకు కసరత్తు..!



అప్పలనరసింహాపురం చెక్ పోస్ట్(ఫైల్)

కోడ్ కూసింది.. పోస్టర్లు, ఫ్లెక్సీలకు ముసుగు పడింది

- ఎన్నికల వేళ అధికారుల విస్తృత తనిఖీలు
- పాలేరులో పెరిగిన ఒక పోలింగ్ కేంద్రం
- 10 బృందాలతో పాటు 29 మంది అధికారుల నియామకం
- క్షేత్రస్థాయిలో సమస్యలపై ఆరా తీస్తున్న అధికారులు



ఆరెగూడెం పోలింగ్ కేంద్రంలో సమస్యలపై ఆరా తీస్తున్న అధికారి శివ

నేలకొండపల్లి: మే 13న జరగనున్న లోక్‌సభ ఎన్నికలకు పాలేరు నియోజకవర్గంలో అధికార యంత్రాంగం ఏర్పాట్లను ముమ్మరం చేసింది. ఇప్పటికే తనిఖీలు విస్తృతంగా చేపట్టేందుకు చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. పోలింగ్ బూత్‌లు గత ఎన్నికల కంటే ఈ సారి పాలేరు నియోజకవర్గంలో ఖమ్మం రూరల్ మండలం ఒక కేంద్రం అదనంగా పెరిగింది. దీంతో ప్రస్తుతం 290 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. పోలింగ్ కేంద్రాలలో కనీస సౌకర్యాలు గురించి సెక్టోరియల్ అధికారులను క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలపై నివేదికను అందించనున్నారు. పాలేరులో మొత్తం 2,39,653 ఓటర్లు ఉండగా.. వారిలో పురుషులు–1,15,243 మంది, స్త్రీలు 1,24,402 మంది, ఎస్‌ఆర్‌లు 19 మంది, సర్వీస్ ఓటర్లు 163 మంది ఓటర్లు ఉన్నారు. పాలేరులో 85 ఏళ్లు దాటినవారు 1,332 మంది, పీడబ్ల్యూడీ ఓటర్లు 7,570 మంది ఓటర్లు ఉన్నారు.

ముమ్మర తనిఖీలు..

లోక్‌సభ ఎన్నికల విజయవంతంగా నిర్వహించేందుకు ఎన్నికల అధికారులు ఒక్కో డివిజన్‌కు నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసింది. పాలేరులో నాయకన్‌గూడెం, పైనంపల్లి, అప్పలనరసింహాపురంలో చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. వాటిలో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 3, సర్వేలైన్ బృందాలు 3, మండల కోడ్ ఆఫ్ కండక్ట్ బృందాలు 4తో పాటు 29 మందిని సెక్టోరియల్ అధికారులను నియమించారు. వీరు పాలేరులో ఎన్నికల నోటిఫికేషన్‌కు కంటే ముందే తనిఖీలు చేపట్టారు.

కోడ్ రాకతో ముసుగు..

కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల కోడ్‌ను ప్రకటించడంతోనే అధికార యంత్రాంగం ప్రతీ పంచాయతీని జల్లెడ పడుతున్నారు. వీధివీధిన తిరుగుతూ.. వివిధ రాజకీయ పార్టీల నాయకులు విగ్రహాలు, ఫ్లెక్సీలు, పోస్టర్లను గుర్తించి వాటికి ముసుగు వేస్తున్నారు. ఎక్కడా పార్టీలకు చెందిన బొమ్మలు, గుర్తులు కనిపించడానికి వీలులేదని అధికారులు హెచ్చరిస్తున్నారు. పాలేరులోని తిరుమలాయపాలెం, నేలకొండపల్లి, కూసుమంచి, ఖమ్మం రూరల్ మండలాలలో పంచాయతీ సిబ్బంది యుద్ధప్రాతిపదికన ముసుగు వేశారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరుపుకోవాలి..

లోకసభ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలి. అధికారులు సమన్వయంతో పని చేసి పోలింగ్ కేంద్రాల సమస్యలపై వెంటనే నివేదికలు ఇవ్వాలి. ఎన్నికల నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలి.. నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదు.

\– రాజేశ్వరీ, రిటర్నింగ్ అధికారి, పాలేరు

కోడ్ ఆఫ్ కండక్ట్‌కు సహకరించండి..



ఎన్నికల నేపథ్యాన ప్రతి ఒక్కరూ ఎన్నికల కోడ్‌కు సహకరించాలి. ఎవరైనా అతిక్రమిస్తే తగు చర్యలు తీసుకుంటాం. జూన్ 6 వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుండగా.. ఎక్కడైనా నిబంధనలు ఉల్లంఘిస్తే తమకు ఫిర్యాదు చేస్తే తగిన చర్యలు తీసుకుంటాం

\– ఎం.యర్రయ్య, ఎంసీసీ అధికారి, నేలకొండపల్లి

పోలింగ్ కేంద్రాల సందర్శన



సుర్దేపల్లి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సెక్టోరియల్ అధికారులు

నేలకొండపల్లి: పోలింగ్ కేంద్రాల కనీస సౌకర్యాలపై మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను సెక్టోరియల్ అధికారులు సోమవారం సందర్శించారు. మండలంలోని వివిధ శాఖలకు చెందిన మండల పంచాయతీ అధికారి సీహెచ్.శివ, మిషన్ భగీరథ ఏఈ విజయరాజు, ఇరిగేషన్ డీఈఈ ఎస్.మన్మధరావు, మండల వ్యవసాయాధికారి అరుణకుమారి, మిషన్ భగీరథ డీఈఈ ఓం ప్రకాశ్, ఖమ్మం అర్బన్ వ్యవసాయశాఖ అధికారి శరత్‌బాబులను సెక్టోరియల్ అధికారులుగా నియమించారు. వీరు ఒక్కొక్కరు 9 నుంచి 12 వరకు పోలింగ్ కేంద్రాలను క్షేత్ర స్థాయిలో సందర్శించి అక్కడ నెలకొన్న సమస్యలు విద్యుత్, తాగునీరు, టాయిలెట్స్ తదితర వాటిపై నివేదిక రూపొందించి కలెక్టర్‌కు సమర్పించనున్నారు. ఈమేరకు సెక్టోరియల్ అధికారులతో పాటు మండల కోడ్ ఆఫ్ కండక్ట్ అధికారి, ఎంపీడీఓ ఎం.యర్రయ్య, తహసీల్దార్ గౌరిశంకర్‌లు పోలింగ్ కేంద్రాలను సందర్శించి కేంద్రాల సమస్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

అవిశ్వాసానికి వేళాయె..

- కామేపల్లి పీఏసీఎస్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానానికి ముహూర్తం ఖరారు
- నేడు కామేపల్లి సంఘం కార్యాలయంలో సమావేశం



కామేపల్లి పీఏసీఎస్ కార్యాలయం

కామేపల్లి: కామేపల్లి ప్రాథమిక సహకార సంఘం (పీఏసీఎస్) తాత్కాలిక చైర్మన్ కాట్రాల రోశయ్యపై డైరెక్టర్లు ఇచ్చిన నోటీసులకు అవిశ్వాస ముహూర్తం ఖరారైంది. ఈ నెల 19న కామేపల్లి ఆ సంఘం కార్యాలయంలో ఉదయం 11 గంటలకు అవిశ్వాస సమావేశాన్ని నిర్వహించనున్నారు. సంఘంలోని 13 మంది డైరెక్టర్లకు గానూ 11 మంది సభ్యులు చైర్మన్ రోశయ్యను తొలగించాలని ఖమ్మంలోని జిల్లా సహకార శాఖాధికారి కార్యాలయంలో డీసీఓకు అవిశ్వాస నోటీస్‌ను ఫిబ్రవరి 24న ఇచ్చిన విషయం విధితమే. ఈ నేపథ్యాన డైరెక్టర్లకు సమాచారాన్ని అందజేయగా.. డీసీఓ ఆధ్వర్యాన ఈ సమావేశం జరిగే అవకాశం ఉంది.

కథ అడ్డం తిరగడంతో..

బీఆర్ఎస్ కైవసం చేసుకున్న కామేపల్లి సొసైటీని అవిశ్వాసం పెట్టి కాంగ్రెస్ పార్టీ కై వసం చేసుకోవాలనే లక్ష్యంగా సొసైటీ పరిధిలోని 11 మంది డైరెక్టర్లను ఏకతాటిపైకి తీసుకొచ్చారు. వీరిలో బీఆర్ఎస్‌కు ఏడుగురు, కాంగ్రెస్‌కు ఐదుగురు, సీపీఐకి ఒకరు చొప్పున డైరెక్టర్లున్నారు. అయితే ఇటీవల బీఆర్ఎస్‌కు చెందిన ఏడుగురు డైరెక్టర్లను కాంగ్రెస్ వైపు మల్చుకున్నారు. బీఆర్ఎస్‌కు చెందిన కామేపల్లి పీఏసీఎస్ చైర్మన్ తీర్థాల చిదంబరరావుపై జనవరి 31న అవిశ్వాస నోటీస్‌ను డీసీఓకు 11 మంది డైరెక్టర్లు అందజేయడంతో ఫిబ్రవరి 19న చైర్మన్‌పై అవిశ్వాస సమావేశం నిర్వహించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. అవిశ్వాస సమావేశానికి రెండు రోజుల ముందే ఫిబ్రవరి 17న చిదంబరరావు స్వచ్ఛందంగా చైర్మన్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు డీసీఓకు లిఖితపూర్వకంగా రాజీనామా పత్రాన్ని అందజేశారు. దీంతో ఉపాధ్యక్షుడిగా ఉన్న కాట్రాల రోశయ్యకు తాత్కాలిక చైర్మన్ బాధ్యతలను అధికారులు అప్పగించగా.. ఫిబ్రవరి 19న ఆయన బాధ్యతలను స్వీకరించారు. అప్పుడే అసలు సమస్య మొదలైంది. బీఆర్ఎస్‌కు చెందిన చైర్మన్ తీర్థాల చిదంబరరావుపై అవిశ్వాస నోటీస్ ఇచ్చి అతని చైర్మన్ పదవి నుంచి తొలగించి ఆ స్థానంలో డైరెక్టర్‌గా ఉన్న పుచ్చకాయల వీరభద్రం చైర్మన్ బాధ్యతలు చేపట్టాల్సి ఉంది. తానే చైర్మన్‌గా కొనసాగుతానని తాత్కాలిక చైర్మన్‌గా ఉన్న రోశయ్య కాంగ్రెస్ ముఖ్య నాయకులను కలిసి తనకు సహకరించాలని కోరాడు. దీంతో అతనిపై ఆగ్రహంతో ఉన్న మిగతా 10 మంది డైరెక్టర్లు రోశయ్యపై అవిశ్వాస నోటీస్ ఇచ్చారు.

ఎన్నికల నిబంధనలు అమలు చేయాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ రామకృష్ణ

తిరుమలాయపాలెం: లోక్‌సభ ఎన్నికల నేపథ్యాన ఎన్నికల నిబంధనలను పకడ్బందీగా అమలు చేయాలని తహసీల్దార్ పీ.వీ.రామకృష్ణ అన్నారు. సోమవారం తిరుమలాయపాలెం మండల పరిషత్ కార్యాలయంలో బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లతో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కొత్త ఓటర్ల నమోదు చేపట్టాలని, మార్పులు చేర్పులు చేయాలని, రాజకీయ పోస్టర్లు, గుర్తులు ఉండకుండా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ నర్సింహారావు, ఆర్ఐ వీరయ్య, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని జిరాక్స్ సెంటర్లు..

నేలకొండపల్లి: మండలంలో చెరువుమాధారం, నేలకొండపల్లి, సింగారెడ్డిపాలెం గురుకుల పాఠశాల కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే పరీక్ష కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్ల యజమానులు నిబంధనలను పట్టించుకోవటం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పరీక్ష కేంద్రాలను తొలి రోజు ఏ అధికారి పర్యవేక్షించకపోవడంతో వారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు తెలిసింది.

మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలి



మాట్లాడుతున్న ఝాన్సీలక్ష్మి

తిరుమలాయపాలెం: దేశంలో ఎన్నడూలేని విధంగా కేంద్రంలోని బీజేపీ పాలనలో పాసిస్ట్ మతోన్మాద విధానాలు పెరిగిపోయి అమాయక ప్రజలు బలవుతున్నారని, మహిళలు చైతన్యవంతంగా పోరాడాలని ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ) రాష్ట్ర కోశాధికారి టి.ఝాన్సీలక్ష్మి పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని బచ్చోడు గ్రామంలో ఉపాధి పనులు నిర్వహిస్తున్న పని ప్రదేశంలో నిర్వహించిన సభలో ఆమె మాట్లాడారు. మహిళా సంక్షేమం కోసం చట్టాలు ఎన్ని చేసినా దేశం, రాష్ట్రంలో మహిళలు దాడులు, హత్యలకూ బలవుతూనే ఉన్నారన్నారు. అయోధ్య రామ మందిరాన్ని అడ్డంపెట్టుకోవాలని చూస్తున్న మోదీ విధానాలను ఎండగట్టి రానున్న ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాలేరు డివిజన్ కార్యదర్శి గోకినేపల్లి సరోజిని , సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ పాలేరు డివిజన్ నాయకుడు తిమ్మిడి హనుమంతరావు, మండల కార్యదర్శి సోమనపల్లి వెంకటేశ్వర్లు, నాయకులు శ్రీనివాసరావు, పిచ్చయ్య, గుజ్జ పుల్లయ్య, వెంకటమ్మ, ఉమా, సునీత తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీఏ ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న వీరభద్రం నాయక్

కూసుమంచి: గిరిజనుల అభివృద్ధి నిమిత్తం ఖమ్మం జిల్లాలో ఐటీడీఏను ఏర్పాటు చేయాలని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా వీరభద్రం ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం కూసుమంచిలో నిర్వహించిన సంఘం పాలేరు నియోజకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల హామీల్లో భాగంగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఐటీడీఏను ఏర్పాటు చేయాలన్నారు. తెలంగాణ సాయుధ పోరాటయోధుడు జాటోత్ ఠానూ నాయక్ 74వ వర్ధంతి సందర్భంగా త్వరలో హైదరాబాద్‌లో జరిగే గిరిజన హక్కుల గర్జనసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించితేనే గిరిజన హక్కులకు మనుగడ లభిస్తుందని, అందుకే వచ్చే ఎన్నికల్లో బీజేపీని ఓడించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా నాయకుడు బానోత్ బాలాజీ, భూక్యా కృష్ణ, హలావత్ బాసూనాయక్, భూక్యా నాగేశ్వరరావు, శ్రీను, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' బకాయిలు చెల్లించాలి



కూలీలతో మాట్లాడుతున్న తాటి వెంకటేశ్వరరావు

ఖమ్మంరూరల్: ఉపాధి హామీ కూలీల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని బీకేఎంయూ జిల్లా ప్రధాన కార్యదర్శి తాటి వెంకటేశ్వరరావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని ఏదులాపురంలో జరుగుతున్న ఉపాధి పనుల ప్రదేశాన్ని సందర్శించి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్న సందర్భంగా ఆయన మాట్లాడారు. పని ప్రదేశంలో నేషనల్ మోనటరింగ్ సిస్టం ద్వారా కార్మికులను నమోదు చేయడం సరికాదని, వెంటనే విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీకేఎంయూ నాయకులు పి.వీరభద్రం, మేళ్లచెరువు వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

బుడగ జంగాల జిల్లా నూతన కమిటీ ఎన్నిక

ఖమ్మం మామిళ్లగూడెం: గుమ్మెట తంబూర మోతబేడ(బుడగ) జంగాల హక్కుల పోరాట సమితి ఖమ్మం జిల్లా నూతన కమిటీని సోమవారం ఖమ్మంలో ఎన్నుకున్నారు. బుడగ జంగం హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు సిరిగిరి మెన్నెంతో పాటు నాయకులు వీరప్ప అధ్యక్షతన జిల్లా చైర్మన్‌గా గంధసిరికి చెందిన పస్తం సహదేవ రాజు గురూజీ, జిల్లా అధ్యక్షుడిగా పల్లెగూడెంకు చెందిన కళ్లెం సీతయ్య, సభ్యులుగా పస్తం వెంకన్న, చేర్ల కోటయ్య, కే.వీ.కోటయ్యరాజు, కొండపల్లి గురవయ్య, పాటి నాగరాజు, పస్తం రామరాజు, పస్తం రంగారావు, గంజాయి కృష్ణ, గంధం జగన్నాథం, సింగపూర్ శ్రీను, ఆలేటి లక్ష్మణ్, భూతం రామచంద్ర, శ్రీపాపతి శ్రీను, కల్యాణం ఏడు కొండలు ఎన్నికయ్యారు. అనంతరం వారంత అభివాదం చేసి తమ హక్కుల కోసం పోరాడతామని పేర్కొన్నారు.

ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు



వేడుకలో పాల్గొన్న భక్తులు

తిరుమలాయపాలెం: తిరుమలాయపాలెంలోని శ్రీ కోదండరామస్వామి ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం ఆలయంలో బ్రహ్మోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు బుర్ర సుందరకుమారచార్యులు హోమాలు, పూజలు నిర్వహించారు. మంగళవారం రాత్రి 7 గంటలకు శ్రీ కోదండరామస్వామి కల్యాణ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంవ్యవసాయం/రఘునాథపాలెం/కామేపల్లి: విద్యుత్ సబ్‌స్టేషన్, వాటి లైన్ల మరమ్మతుల కారణంగా నేడు (మంగళవారం) విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖాధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఖమ్మం నగరంలోని ఇల్లెందు క్రాస్ రోడ్ 33/11 కేవీ సబ్ స్టేషన్ కవిరాజ్‌నగర్ 11 కేవీ ఫీడర్ ఎల్‌టీ లైన్ పనుల కారణంగా కవిరాజ్‌నగర్‌రోడ్ నంబర్ 9, 10లలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని టౌన్–3 ఏఈ ఆపరేషన్స్ బి.తావుర్యా తెలిపారు. అలాగే, రఘునాథపాలెం మండలంలోని వి.వెంకటాయపాలెం 11 కేవీ విద్యుత్ ఫీడర్ మరమ్మతుల కారణంగా ఈ ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు వీవీ పాలెం, కలెక్టరేట్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా కామేపల్లి 33/11 కేవీ ఉపకేంద్రం పరిధిలోని ఊటుకూరు ఫీడర్ పరిధిలో లైన్ మరమ్మతుల కారణంగా తాళ్లగూడెం, టేకులతండా, జోగ్గూడెం గ్రామాలకు ఉదయం 7 గంటల నుంచి 11 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాసులు తెలిపారు. వినియోగదారులు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

'బార్' నామినేషన్ల స్వీకరణ

ఖమ్మంలీగల్: 2024–25 సంవత్సరానికి గాను జిల్లా బార్ అసోసియేషన్ ఎన్నికలకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. మొదటి రోజు సోమవారం అధ్యక్ష పదవికి 2 నామినేషన్లు, వైస్ ప్రెసిడెంట్ జాయింట్ సెక్రటరీ, కోశాధికారి పోస్టులకు ఒక్కొక్కటి నామినేషన్లు దాఖలయ్యాయి. అధ్యక్ష పదవికి చిలుకూరి స్వర్ణకుమారి, నెరెళ్ల శ్రీనివాసరావు, ఉపాధ్యక్ష పదవికి కె.ఉపేందర్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీకి కాండే వెంకటేశ్వరరావు, కోశాధికారికి ఇజ్జగాని శ్రీనివాసరావులు నామినేషన్లు దాఖలు చేసినట్లు బార్ ఎన్నికల అధికారి మారగాని శ్రీనివాసరావు తెలిపారు.

'రాయల' పూజలు

నేలకొండపల్లి: రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు సోమవారం యాదగిరిగుట్టలోని యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహాస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ఆ దేవుడిని కోరుకున్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

'పది' పరీక్షలు ప్రశాంతం..



తనిఖీ చేస్తున్న కలెక్టర్ వీ.పీ.గౌతమ్



కామేపల్లి: ఎంజేపల్లి హైస్కూల్ పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ సుధాకర్, తదితరులు



పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు కావడంతో ఆయా పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు ముందుగానే చేరుకోవడంతో అర్ధగంట ముందే తనిఖీ చేసి లోపలికి పంపించారు. ఈనేపథ్యాన పరీక్షా కేంద్రాలను అధికారులు పరిశీలించి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూశారు. కాగా, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ధైర్యం చెప్పి వారు తిరిగి వచ్చేంతవరకు పరీక్ష కేంద్రం బయట నిరీక్షించారు.

\– సాక్షి నెట్‌వర్క్



తిరుమలాయపాలెం: పిండిప్రోలులో విద్యార్థులను తనిఖీ చేస్తున్న ఉపాధ్యాయులు



ఖమ్మంలోని ఓ పరీక్షా కేంద్రం వద్ద నిరీక్షిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు



పరీక్షా కేంద్రం వద్ద హాల్ టికెట్ నంబర్లను సరిచూసుకుంటున్న విద్యార్థులు



నేలకొండపల్లి పాఠశాల వద్ద తనిఖీ..